క్లుప్తంగా

గడప గడపకు బీజేపీ

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. మాతృదినోత్సవం సందర్భంగా మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన సమస్యలపై మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకుల పాలనలో ఎక్కడా చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. ప్రజలు ఈ అవినీతి పాలనతో విసిగిపోయి ఉన్నారని అన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా బీజేపీ పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు పర్వతాలుయాదవ్, శ్రీహరియాదవ్, రాజిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ పటేల్, శ్రీధర్ పటేల్, రమేష్ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అష్టోత్తర శత కలశాభిషేకం



కూకట్‌పల్లి: హనుమాన్ జయంతి పర్వదిన సందర్భంగా ఆదివారం కేపీహెచ్‌బీకాలనీలోని శ్రీ వీరాంజనేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి అష్టోత్తర శత కలశాభిషేకం, విశేష పుష్ప అలంకరణ, ఉదయం 7గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, 10 గంటల నుంచి సామూహిక లక్ష తమలపాకుల పూజా కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. సాయంత్రం 7గంటలకు రథోత్సవం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు.

ఉత్సాహంగా సైక్లథాన్

మాదాపూర్: ఫిట్‌నెస్‌పై చిన్నారులకు, పెద్దలకు అవగాహన కల్పించడం ముఖ్యమని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్ వద్ద ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా 10కిలో మీటర్ల సైక్లోథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియం నుండి ఇనార్బిట్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీసీపీ శిల్పవల్లి తెలంగాణ క్రీడాభివృద్ధి సంస్థ అధ్యక్షులు డాక్టర్ అంజనేయగౌడ్ నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఆప్ట్రోనిక్స్ సీఈఓ మేఘనాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: మియాపూర్‌లోని గ్రేట్ అనాథాశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మూర్తి ప్రేమ వేల కట్టలేదని, నవమాసాలు కని పెంచి జన్మనిచ్చిన మాతృమూర్తి నిస్వార్థమైనదని పేర్కొన్నారు. తల్లిని మించిన దైవం లేదన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ జనార్దన్, సభ్యులు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

నిజాంపేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు.

క్రికెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని సింహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ శిక్షణా కేంద్రాన్ని శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ బ్యాట్‌ను ఝుళిపిస్తూ కొద్దిసేపు ఆయన సందడి చేశారు. క్రీడాకారులను అన్ని విధాలుగా తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు బొంబడి బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, విజయ్‌రామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవిరెడ్డి, రామ్‌కుమార్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి







మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని పలు హనుమాన్ దేవాలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూసాపేట డివిజన్‌లోని అవంతినగర్ తోట శ్రీ షిరిడీ సాయి బాబా దేవాలయంలోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానందనగర్‌లోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పర్వత్‌నగర్, గణేష్ నగర్, తులసినగర్, శివాజీనగర్, రామారావు నగర్‌లతో పాటు పలు బస్తీ కాలనీల్లోని హనుమాన్ దేవాలయాలు హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

– మోతీనగర్



శ్రీ వివేకానందనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



అవంతినగర్ తోట హనుమాన్ దేవాలయంలో భక్తులకు ప్రసాదాన్ని అందిస్తున్న ఆలయ సేవకుడు కప్ప వెంకట్రాజు

ఎస్ఎంఆర్ వినయ్ ఫౌంటైన్ హెడ్‌లో..



కేపీహెచ్‌బీకాలనీ: ఎస్ఎంఆర్ వినయ్ ఫౌంటైన్ హెడ్‌లో ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చందన అలంకారం చేసి, లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు 108 సార్లు హనుమాన్ చాలీసాను వాయిద్య సహకారంతో పారాయణం చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

భాగ్యనగర్‌కాలనీ: శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్ రామాలయంలో, శ్రీనివాస్‌కాలనీ హనుమాన్ దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు గాంధీ రావు, మూర్తి, గోపిచంద్, చక్రపాణి, వెంకటేశ్వర్‌రావు, రాముడు, సుధాకర్, రామకృష్ణయ్య, రాజగోపాల్ రెడ్డి, బుల్లయ్య, రవి, మాధవయ్య, ఎల్లయ్య, నాగేశ్వర్‌రావు, సత్యనాథరావు, నవీన్, సుబ్బరాజు, వేణుగోపాల్‌రాజ్, సీతారామరాజు, రామరాజు, సతీష్, శ్రీనివాస్, లోకేష్, రాజేష్, శివ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

మహిళలు, పిల్లలకు పార్కు నిర్మించుకోవడం సంతోషంగా ఉంది

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలాజీనగర్ డివిజన్‌లో మహిళలకు, చిన్నారులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కును ప్రారంభిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావు తదితరులు



కూకట్‌పల్లి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌యస్ పార్టీలో చేరిన వివిధ పార్టీలకు చెందిన యువకులు

కూకట్‌పల్లి: నియోజకవర్గ పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలో మహిళలకు, చిన్నారులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కును ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ఎక్కడా దోకాలేకుండా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. అందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా మారిందన్నారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేకంగా పార్కులను రూపొందించడటం మొట్టమొదటిసారిగా కూకట్‌పల్లి నుంచి ఆరంభమైందన్నారు. కేపీహెచ్‌బీలో నిర్మించిన పార్కు ఎంతో జనాధరణ పొందిందని నేడు బాలాజీనగర్ డివిజన్‌లో నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా షటిల్ కోర్టు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పార్కులో చిన్నారులకు ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయడమే కాకుండా షటిల్ మైదానాన్ని ఏర్పాటు చేయటం, యోగా చేసుకోవటానికి అనుగుణంగా రూపొందించామని, ఓపెన్ జిమ్ ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు...

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన సుమారు 100 మంది బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ పార్టీలకు చెందిన యువకులు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఎంతోమంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. బాలానగర్ ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిలు, మంచినీటి సౌకర్యం ఈ విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో ఐదు రోజులుగా కొనసాగిన శ్రీ శివరామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, కుంబాభిషేక మహోత్సవ వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకల్లో శ్రీవిద్యాశంకర భారతిస్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప పూజలు, ప్రధాన దేవతా మూలమంత్ర హోమాలు, స్థల శుద్ధి, గర్తన్యాస, రత్నన్యాస, ధాతున్యాస, బీజ న్యాస, న్యాసములు నిర్వహించారు. 9.36 గంటలకు శ్రీ మహాగణపతి, ఆంజేయ, శివ, లలితా, సుబ్రహ్మణ్య, కాల భైరవ, నవగ్రహ, యంత్ర స్థాపన, సుముహూర్తము, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రతిష్ఠాంగ హోమాలు, వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. 11 గంటలకు శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధీశ్వరులు శ్రీ మదభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామి వారి ఆశీః పూర్వక అనుగ్రహ భాషణం వంటి కార్యక్రమాలతో పాటు శివపార్వతుల, సీతారాముల కల్యాణంతో వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో శ్రీ శివరామాంజనేయ దేవాలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శ్రీశివరామాంజనేయ దేవాలయ పునర్ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవిద్యాశంకర భారతి స్వామి, భక్తులు



నేడు నిజాంపేట్‌లో ఎమ్మెల్యే పర్యటన

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే వివేకానంద్ పర్యటించనున్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఉదయం 7.30 గంటలకు మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌లతో కలిసి 13వ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల పావని పాల్గొననున్నారని బీఆర్‌ఎస్ శ్రేణులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని మేయర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో 13 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. రోజుల తరబడి జ్వరం, దగ్గు, గొంతు నొప్పి తదితర లక్షణాలుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకుని చికిత్స చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి



సమ్మర్ క్యాంప్‌ను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్న కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ మేనేజర్ కె. రాములు ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ జయ శంకర్ కాలనీ కమ్యూనిటీహాలులో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను కుమార్‌యాదవ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అంకితభావంతో కూడిన జీవితాన్ని నిర్మాణం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన కోసం పనిని ప్రారంభించి మొక్కవోని దీక్షతో కృషి చేస్తే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు. తల్లిదండ్రులతో, అధ్యాపకులతో గాని, సమాజంలో పెద్దలతో గౌరవంగా మాట్లాడే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఉండి ఎలాంటి దురలవాట్లకు పాల్పడకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే జీవితాన్ని మంచి వైపు మలుపు తిప్పుకుంటే జీవితంలో అనేక విజయాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు పిరికితనంగా ఉండకుండా జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను సవాల్‌గా స్వీకరించి ధైర్యంగా ఎదుర్కోవడానికి మానసికంగా, భౌతికంగా సిద్ధమవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీపతినాయుడు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

మోతీనగర్: తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు సాధారణ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని కూకట్‌పల్లి నియోజకవర్గం బీ–బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

మంచి ఉద్యోగం రాలేదని ఉరేసుకుని ఆత్మహత్య

జీడిమెట్ల: మంచి ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెల్పిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా అరుంధతి నగర్‌కు చెందిన బాలరమేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బాల అఖిల్ (25) కుత్బుల్లాపూర్ చింతల్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ మెడికల్ బిల్లింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఉందని చెప్పి గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. ఎంతకూ గదిలోంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తట్టగా ఎంతకూ తలుపులు తీయలేదు. దీంతో తలుపులు తెరచి చూడగా ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతుడి తండ్రి బాలరమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్క్రాప్ విక్రయాలపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

బాలానగర్: బాలానగర్ పారిశ్రామిక వాడలోని ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్) మందుల పరిశ్రమలోని స్క్రాప్ విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీఐటీయూ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అక్రమ విక్రయాలలో కేంద్ర ప్రభుత్వ అధికార పార్టీ పెద్దల హస్తం ఉన్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను, ప్రజలను ఐక్యం చేసి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ధైర్యానికి, విశ్వాసానికి ప్రతీక ఆంజనేయ స్వామి

వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాస్థనం వారి అనుబంధ దేవాలయం శ్రీ ధ్యాసాంజనేయస్వామి దేవాయలంలో 17వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి పవిత్రోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాచనలు అందుకున్నారు. రాజేశ్వరరావును ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుదర్శన్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధైర్యానికి, విశ్వాసానికి ప్రతీక అయిన హనుమాన్ ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రార్థించారు. ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీని రాజేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.



ధ్యాసాంజనేయస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు

చైన్ స్నాచర్ అరెస్టు

బంగారు గొలుసు స్వాధీనం

కేపీహెచ్‌బీకాలనీ: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకొని పారిపోయిన ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు 39 గ్రాముల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. శుక్రవారం నిజాంపేట రోడ్డు ప్రాంతంలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉండే శంకబాతుల మహాలక్ష్మి (56) భర్త, కొడుకు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఉదయం 11.30 గంటల సమయంలో అదే కాలనీలో నివాసం ఉండే ఎం. కోటేశ్వరరావు (24) మహాలక్ష్మి ఇంటికి వెళ్లి తలుపు కొట్టడంతో గడియతీసింది. వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకునేందుకు యత్నించగా ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది.

◆ దీంతో ఆమె కళ్లలోకి గుర్తు తెలియని పౌడర్‌ను చల్లిన వెంకటేశ్వరావు బంగారు గొలుసును తెంచుకొని బయట గడియపెట్టి పారిపోయాడు. స్థానికుల సహకారంతో మహాలక్ష్మి కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి పుస్తెలతాడును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన ఒక్కరోజులోనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన బాలానగర్ సీసీఎస్ పోలీసులు, కేపీహెచ్‌బీ క్రైమ్ విభాగం సిబ్బందిని సైబరాబాద్ ఉన్నతాధికారులు అభినందించారు. విలేకరుల సమావేశంలో కేపీహెచ్‌బీ సీఐ కిషన్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ కిషన్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు